క్లుప్తంగా

గుణపాఠం చెబుతాం



వెంకటాచలంలో పాదయాత్ర చేస్తున్న ఎంఎస్పీ నాయకులు

వెంకటాచలం: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలను మోసం చేసిన బీజేపీకి గుణపాఠం చెబుతామని ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జి గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ పేర్కొన్నారు. గత నెల 26వ తేదీన సూళ్లూరుపేట నుంచి ప్రారంభమైన మాదిగల సంగ్రామ పాదయాత్ర గురువారం ఉదయం వెంకటాచలానికి చేరడంతో మండల నాయకుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్నా ఎస్సీ వర్గీకరణ ఊసే ఎత్తకుండా మాదిగలను నమ్మించి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పందిటి అంబేడ్కర్ మాదిగ, మందా పెంచలయ్య మాదిగ, మందా నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీసీఎమ్మెస్ చైర్మన్ జన్మదిన వేడుకలు

కొడవలూరు: డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు జన్మదిన వేడుకలు మండలంలోని నార్తురాజుపాళెం వీసీఆర్ లేఅవుట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరై చలపతి రావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, విజయ డెయిరీ, అప్కాప్ చైర్మన్లు కొండ్రెడ్డి రంగారెడ్డి, కొండూరు అనిల్‌బాబు, డీఏబీ, ఏఎంసీ చైర్మన్లు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కాకాణి మనవడి పుట్టినరోజు

మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మనమడు సార్యవర్ధన్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆవుల తులసీరాం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చంచమ్మ, సచివాలయం కన్వీనర్ ఆవుల జగదీష్, ఉపాధ్యాయిని విజయ, భారతి పాల్గొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో..

వెంకటాచలం: మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ జన్మదిన వేడుకలు వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. వారి కుమార్తె, స్వర్ణభారత్ ట్రస్టీ దీపావెంకట్‌తో కలిసి ఉషమ్మ కేక్ కట్ చేశారు.

ఆంగ్లభాషపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఉషారాణి

బుచ్చిరెడ్డిపాళెం: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించాలని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. మండలంలోని దామరమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఇంగ్లిష్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంగ్లభాష కష్టతరం కాదని, గ్రామర్‌ను క్షుణ్ణంగా పరిశీలించగలిగితే చాలా సులభమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్‌కుమార్, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు కృపాల్, కృష్ణ మోహన్, చెన్నయ్య, సురేష్ పాల్గొన్నారు.

‘గడప గడపలో’ సమస్యలకు స్వస్తి

- సత్ఫలితాలిస్తున్న ‘గడప గడపకు మన ప్రభుత్వం’
- గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్న మంత్రి కాకాణి
- యుద్ధప్రాతిపదికన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం
- రెండు వారాల్లోగా బిల్లుల చెల్లింపు



ప్రభగిరిపట్నంలో కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి(ఫైల్)

పొదలకూరు : ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. మంత్రి స్థాయిలో ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలో 15 సచివాలయాల పరిధిలో ఇప్పటికే ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. మరో 8 సచివాలయాల పరిధిలో పర్యటిస్తే గడప గడపకు పూర్తవుతుంది. మార్చి చివరి నాటికి కార్యక్రమాన్ని పూర్తి చేసే యోచనలో మంత్రి ఉన్నట్లు తెలుస్తోంది.

దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం

ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలతోపాటు, రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం కూడా ఈ కార్యక్రమం ద్వారా పూర్తవుతున్నాయి. ఇందుకోసం సచివాలయాలకు అందజేస్తున్న నిధులతోపాటు, వివిధ రకాలుగా నిధులను మంత్రి కాకాణి సమకూర్చుతున్నారు. చాలాకాలంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుండడంతో గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవలి కాలంలో పరిష్కారమైనవి

- మరుపూరు బీసీకాలనీలో 11 కేవీ విద్యుత్ లైన్లు ఎప్పటి నుంచో ఇళ్ల మీదుగా ఉన్నాయి. ఇందువల్ల కాలనీవాసులు భయం గుప్పెట్లో కాలం వెళ్లదీసేవారు. వర్షాకాలం తీగలు రాసుకుని నిప్పులు కురిసేవి. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కాకాణి దృష్టికి కాలనీవాసులు తీసుకుని వెళ్లడంతో రెండు రోజుల్లో సమస్య పరిష్కారమైంది.
- వరదాపురం రుస్తుం మైన్ వద్ద స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న గిరిజనులకు సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతుండగా వారి సమస్యను గుర్తించిన మంత్రి కాకాణి రూ.35 లక్షలతో సిమెంటురోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. దీంతో గిరిజనుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.
- విరువూరు, నేదురుమల్లి, పులికల్లు, డేగపూడి, మరుపూరు తదితర సచివాలయాల పరిధిలో రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనుల నిర్మాణం పూర్తయ్యాయి.
- తాటిపర్తి, పొదలకూరు, దుగ్గుంట సచివాలయాల పరిధిలో రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులు పురోభివృద్ధిలో ఉన్నాయి.
- ఆర్‌వైపాళెం, ప్రభగిరిపట్నం సచివాలయాల పరిధిలో ఇటీవలే పర్యటన పూర్తైంది. చిన్నపాటి సమస్యలైతే అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.



ఇరువూరులో నిర్మిస్తున్న సైడ్‌డ్రెయిన్లు



వరదాపురం గిరిజనకాలనీలో నిర్మించిన సిమెంటురోడ్డు

పేదలకు వరం



‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం కాలనీల్లో నివసిస్తున్న పేదలకు వరం లాంటిది. అన్నిప్రభుత్వ శాఖల అధికారులు మంత్రితో పాటు పాల్గొంటుండడంతో సమస్యలకు వెంటనే పరిష్కారం లభిస్తోంది. మంత్రి స్థాయిలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, సమస్యలను అడిగి తెలుసుకోవడం సంతోషంగా ఉంది.

– పాముూరు లచ్చారెడ్డి, ఉప సర్పంచ్, తాటిపర్తి

వెంటనే పనులు ప్రారంభం



‘గడప గడపకు మన ప్రభుత్వం’లో గుర్తించిన పనులను వెంటనే ప్రారంభిస్తున్నాం. బిల్లులు సైతం రెండువారాల్లోగా జమ అవుతున్నాయి. విరువూరు, మరుపూరు, పులికల్లు, నేదురుమల్లి తదితర గ్రామాల్లో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేయించాం.

– కె.కసనానాయక్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పొదలకూరు

పరీక్షలంటే భయం వీడాలి



ప్రేరణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎంఓ సుధీర్‌బాబు

పొదలకూరు: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడి ధైర్యంగా పరీక్షలు రాయాలని సర్వశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాల, బాలికల హైస్కూళ్లలో గురువారం పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ప్రముఖ మోటివేటర్ కోదండరామ్ ద్వారా ప్రేరణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు సమీపించేకొద్దీ భయపడడం సహజమేనన్నారు. అయితే సమయస్ఫూర్తిగా వ్యవహరించి భయాన్ని వీడాలని సూచించారు. మోటివేటర్ కోదండరామ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలన్నారు. బట్టీ విధానాన్ని వీడి అర్థం చేసుకుని చదివితే పరీక్షలు బాగా రాయవచ్చని తెలిపారు. మండలంలోని తాటిపర్తి, మహ్మదాపురం, విరువూరు జెడ్పీ హైస్కూళ్లలో కూడా మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తామని ఏఎంఓ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సనత్‌కుమార్, పెర్సిస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



తాటిపర్తిలోని పాండురంగస్వామి ఆలయం

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు శ్రీరుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయని నిర్వాహక కమిటీ గురువారం తెలిపింది. 4న అంకురార్పణ, 5న గరుడసేవ, గ్రామోత్సవం, 6న స్వామి వారి కల్యాణోత్సవం, గిన్నెభిక్ష గ్రామోత్సవం, 7న శ్రీపాండురంగస్వామి అగ్నిగుండ ప్రవేశ మహోత్సవం, 8న వసంతోత్సవం, ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విజేతలకు అభినందన



బహుమతులు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ముత్తుకూరు: పొదలకూరు మండలం మహమ్మదాపురంలో ఇటీవల జరిగిన గ్రిగ్ మెమోరియల్ టోర్నమెంట్‌లో పలు క్రీడల్లో బహుమతులు సాధించిన తమ పాఠశాల విద్యార్థులను ఈపూరు వెంకనపాళెం పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అభినందించారు. గురువారం ఆ పాఠశాలలో జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమం, బహుమతి ప్రదానోత్సవంలో బాల్ బ్యాడ్మింటన్‌లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. అలాగే వాలీబాల్ పోటీలో విజేతలైన ప్రశాంత్, అక్షిత్‌బాబు, కిషోర్‌లను, షూటింగ్‌బాల్‌లో ప్రతిభ కనబరచిన చరణ్, కుషల్‌కుమార్‌లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్‌తో డ్రాపౌట్స్ నివారణ



సీజనల్ హాస్టల్‌లోని చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఈఓ వసంతకుమారి

కొడవలూరు: సీజనల్ హాస్టల్ ఏర్పాటు ద్వారా గిరిజన ప్రాంతాల్లో డ్రాపౌట్స్ పూర్తిగా తగ్గుతున్నారని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ గిరిజనకాలనీలోని సీజనల్ హాస్టల్‌ను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు, హాస్టల్ సిబ్బందితో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో డ్రాపౌట్స్‌ను నివారించే లక్ష్యంతో ఇక్కడ సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ హాస్టల్‌లో ఏ పాఠశాలలో చదివే పిల్లలకైనా ఉదయం టిఫిన్, రాత్రి భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం మాత్రం పాఠశాలల్లో చేయాల్సి ఉంటుందన్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం కూడా అందిస్తారన్నారు. రాత్రి వేళలో హాస్టల్‌లోనే వసతి పొందే వెసులుబాటు ఉందని తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన ఈ హాస్టల్‌లో 50 మంది పిల్లలకు పైగా ఉంటున్నారంటే సీజనల్ హాస్టల్ పేద పిల్లలకు ఎంతగా దోహదపడుతుందో అర్థమవుతుందని తెలిపారు. హాస్టల్‌ను వినియోగించుకొంటున్న వారంతా గిరిజన, వలస కూలీల పిల్లలని స్పష్టం చేశారు. ఆమె వెంట సీఆర్‌పీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు ఉన్నారు.

ముఖ్యమంత్రి నిర్ణయం అభినందనీయం

కొడవలూరు: సఫాయి కార్మికుల సంక్షేమం, పరిరక్షణ బాధ్యతను ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు అప్పగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని సమతా సైనిక్‌దళ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బండి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్ సఫాయి కార్మికుల సంక్షేమానికి నిస్వార్థంగా కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సమతా సైనిక్ దళ్ యువజన విభాగం మండల నాయకులు బందిల శ్రీను, పచ్చ ప్రేమ్‌కుమార్, పొన్నూరు సాగర్, అజయ్ పాల్గొన్నారు.

సెంబ్‌కార్ప్‌కి బీబీసీ అవార్డు



అవార్డు అందుకొంటున్న ప్రాజెక్టు ఉన్నతోద్యోగులు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న సెంబ్‌కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌కు ప్రతిష్టాత్మకమైన ‘బిహేవియర్ బేస్‌డ్ సేఫ్టీ–బీబీసీ’ అవార్డు లభించింది. పనిచేసే ప్రదేశంలో ప్రవర్తన ఆధారిత భద్రత అమలు చేస్తున్నందుకుగాను ఈ అవార్డు లభించిందని ప్రాజెక్టు సీఈఓ రాఘవ్ త్రివేది గురువారం ఆ కంపెనీలో తెలిపారు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ‘ఫోరమ్ ఆఫ్ బిహేవియరల్ సేఫ్టీ’ అనే సంస్థ ఈ అవార్డును అందజేసిందన్నారు. ఐదేళ్లలో వరుసగా ఐదు సేఫ్టీ అవార్డులు దక్కించుకోవడం భద్రత పట్ల తమకున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇందుకు సహకరిస్తున్న ప్రాజెక్టు ఉద్యోగులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

భవిత కేంద్రాల పరిశీలన



కోవూరు: స్థానిక భవిత కేంద్రాన్ని గురువారం సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రంలోని చిన్నారులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వారి మానసిక స్థితి మెరుగుపడేందుకు అవసరమైన ఫిజియోథెరిపి చేయిస్తామని తెలిపారు. ఇలాంటి కేంద్రాలకు పిల్లలను పంపడం ద్వారా వారికి మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఫిజియోథెరిపీ కాకుండా చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్స్ అందించి వారికి చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ఫిజియోథిరిపిస్టులు చెప్పే సూచనలు తల్లిదండ్రులు పాటిస్తూ పిల్లల భవిష్యత్‌ను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట ఫిజియోథెరిపిస్ట్ దుర్గాప్రసాద్, సిబ్బంది మహేష్, కృపావతి, లక్ష్మి, సుకన్య తదితరులు ఉన్నారు.

గంగపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.04/2023 టెండర్ ప్రకటన తేది: 02-03-2023

ఇందుమూలముగా ఇందుకూరుపేట మండలం గంగపట్నం గ్రామ పంచాయతీలో తేదీ 01-04-2023 నుండి తేదీ 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం పరిమితితో ఈ క్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకొనవచ్చును.

వ.	వివరములు	పోస్టులు	ధరావత్తు
1.	తాత్కాలిక స్వీపర్స్, PWS ఆపరేటర్స్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	6	రూ.100/-
2	తాత్కాలిక ఎలక్ట్రీషియన్ ఆపరేటర్ (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-

పై టెండర్లను తేది 10-03-2023 శుక్రవారం ఉదయం10.30 గంటలకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరువబడును. మిగతా విషయములు కార్యాలయం పనిచేస్తున్న సమయంలో తెలుకొనవచ్చును. ఏదైనా ప్రభుత్వసెలవు ప్రకటించిన ఎడల తదుపరి పని దినమునందు టెండర్లు స్వీకరించబడును.

సం/- కె.వీరయ్య, పంచాయతీ కార్యదర్శి, గంగపట్నం గ్రామ పంచాయతీ, ఇందుకూరుపేట(మం) SPSR నెల్లూరుజిల్లా.

ముదివర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం

ఆర్.ఓ.సి.నెం.02/2023 టెండర్ ప్రకటన తేది: 02-03-2023

ఇందుమూలముగా విడవలూరు మండలం ముదివర్తి గ్రామ పంచాయతీలో తేది 01-04-2023 నుండి తేది 31-03-2024 వరకు ఒక సంవత్సర కాలం పరిమితితో ఈ క్రింది పోస్టులకు టెండర్లు దాఖలు పరచుకొనవచ్చును.

వ.	వివరములు	పోస్టులు	ధరావత్తు
1.	తాత్కాలిక స్వీపర్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
2.	తాత్కాలిక PWS ఆపరేటర్స్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	2	రూ.100/-
3	తాత్కాలిక ఎలక్ట్రీషియన్ పోస్టులు (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-
4	తాత్కాలిక బిల్ కలెక్టర్ (తేది 01-04-2023 నుండి 31-03-2024 వరకు)	1	రూ.100/-

పై టెండర్లను తేది 10-03-2023 శుక్రవారం ఉదయం10.30 గంటలకు టెండర్లు స్వీకరించి అదే రోజు మధ్యాహ్నం 4.00 గంటలకు సీల్డ్ టెండర్లు తెరువబడును. మిగతా విషయములు కార్యాలయం పనిచేస్తున్న సమయంలో తెలుకొనవచ్చును. ఏదైనా ప్రభుత్వసెలవు ప్రకటించిన ఎడల తదుపరి పని దినమునందు టెండర్లు స్వీకరించబడును.

సం/- డి.అచ్చయ్య, పంచాయతీ సెక్రటరీ, ముదివర్తి గ్రామ పంచాయతీ.

అనుమానంతోనే కడతేర్చాడు

- అనుదీప్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరులో కలకలం రేకెత్తించిన అనుదీప్ హత్యకేసులో నిందితుడిని వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కడతేర్చినట్లు నిందితుడు అంగీకరించాడు. నగరంలోని వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి స్థానిక ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావుతో కలిసి గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. పొదలకూరు గ్రామం రామమందిరం వీధికి చెందిన రావుల అనుదీప్(30), పావని దంపతులు. వారికి ఓ పాప ఉంది. ఏడునెలల కిందట ఆయన తన కుటుంబంతో కలిసి నెల్లూరుకు వచ్చారు. బుజబుజనెల్లూరు గణపతిప్లాజాలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో గతనెల 22వ తేదీ తెల్లవారుజామున అనుదీప్ స్నేహితుడైన పొదలకూరుకు చెందిన పచ్చ సురేష్ చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు కేసు నమోదు చేశారు. ఆ దిశగా విచారణ చేపట్టగా సురేష్ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండటంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం మనుబోలు మండలం, వడ్లపూడి గ్రామంలో సురేష్‌ను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అతని వద్ద నుంచి బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరూ స్నేహితులే

పొదలకూరు గ్రామంలో అనుదీప్, సురేష్‌లు పక్క పక్క ఇళ్లలో నివాసం ఉండేవారు. ఇరు కుటుంబాలు ఎంతో కలివిడిగా ఉండేవి. ఈ క్రమంలో అనుదీప్‌కు తన భార్యతో వివాహేతర సంబంధం ఉండొచ్చన్న అనుమానం సురేష్‌లో బలంగా నాటుకుపోయింది. దీంతో స్నేహితుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఎలాగైనా అనుదీప్‌ను హత్యచేయాలని నిందితుడు నిర్ణయించుకున్నాడు. 22వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటలకు నెల్లూరుకు చేరుకుని అనుదీప్‌ను కలిశాడు. తల్పగిరికాలనీ సమీపంలో మూత్రవిసర్జనకు అనుదీప్ బైక్ ఆపగా ఇదే అదనుగా భావించిన సురేష్ కత్తితో అతన్ని గొంతుకోసి హత్యచేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడని డీఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్స్ జి.సుబ్బారావు, సురేష్, కానిస్టేబుల్స్ మస్తాన్, నాగరాజులను డీఎస్పీ అభినందించారు. రివార్డ్స్ కోసం ఎస్పీకి సిఫార్సు చేశారు.